ప్రజాశక్తి
సోమవారం 22 సెప్టెంబర్ 2025
5
విజయనగరం



నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చని తెలిపారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్సప్ ద్వారా పంపిస్తున్నామని చెప్పారు. ఎండార్స్‌మెంట్‌ను రిజిస్టర్ పోస్ట్ ద్వారా సంబంధిత చిరునామాకు పంపిస్తున్నామని చెప్పారు. అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

గురజాడ రచనలు నిత్య నూతనం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ • ఘనంగా మహాకవి అప్పారావు 163వ జయంతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహాకవి గురజాడ అప్పారావు భావాలు, రచనలు నిత్య నూతనమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు 163వ జయంతి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నగరంలోని గురజాడ స్వగృహంలోని చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్య జంక్షన్ సమీపంలోని గురజాడ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురజాడ దేశభక్తి గేయాలను ఆలపించారు. జంక్షన్‌లోని గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జయంతి సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ వందేళ్ల క్రితమే గొప్ప ముందుచూపుతో మహాకవి రచనలు చేశారని తెలిపారు. ప్రధాని మోడీ సైతం గురజాడ రచనల నుంచి స్ఫూర్తి పొందారని, ఆయన రాసిన దేశభక్తి గేయాన్ని ప్రస్తావించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. గురజాడ స్వగృహం పక్కనున్న స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి మాట్లాడుతూ గురజాడ గొప్ప సంఘ సంస్కర్తని, ఆయన కన్యాశుల్కంలో సృష్టించిన గిరీశం, మధురవాణి, రామప్పపంతులు లాంటి

గురజాడ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, ప్రదర్శనలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఉన్నతాధికారులు

పాత్రలు ఇప్పుడు కూడా మన కళ్లముందే కదలాడుతున్నాయని చెప్పారు. ప్రపంచంలోని విభిన్న సాహిత్యాలను అధ్యయనం చేసిన గురజాడ, తెలుగు జాతికి అపూర్వ రచనలను అందించారని కొనియాడారు.

ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్ని తరాలు మారినా గురజాడ రచనలు సజీవంగా నిలిచే ఉంటాయని అన్నారు. ఆయన దేశభక్తి గేయం భావితరాలకు స్ఫూర్తి దాయకమన్నారు. తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, గురజాడ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ గురజాడ గొప్పదనాన్ని వివరించారు.

గురజాడ స్వగృహం నిర్వహణకు ప్రతి నెలా నిధులు విడుదల చేయాలని, నివాసాన్ని పరిరక్షించాలని గురజాడ కుటుంబ సభ్యులు వెంకటేశ్వరప్రసాద్, ఇందిర, లలిత కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, డిఇఒ మాణిక్యం నాయుడు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డిఎపిఆర్‌ఒ గోవిందరాజులు, జిల్లా పర్యాటక అధికారి కుమారస్వామి, మహారాజా సంగీత కళాశాల ప్రిన్సిపల్ మండపాక నాగలక్ష్మి, సాహితీ సంఘాల ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్ష పీఠంపై త్వరలో వీడనున్న ఉత్కంఠ

సువ్వాడకు హెచ్చు అవకాశాలు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై త్వరలోనే ఉత్కంఠ వీడనుంది. ఈ నెలాఖరులోపు రథసారథి ఎవరనేది తేలే అవకాశాలు ఉన్నట్టు పార్టీలో చర్చ నడుస్తోంది. ఈ పదవి కోసం గజపతినగరం నియోజకవర్గం నుంచి ఇద్దరు, నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి మరో ఇద్దరు చొప్పున.. మొత్తం నలుగురు పోటీ పడుతున్నారు. అధిష్టానం కూడా వీరి పేర్లను పరిశీలనలోకి తీసుకున్నట్టుగా సమాచారం. వీరిలో నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్‌కు హెచ్చు అవకాశాలు ఉన్నాయని కూడా ఎక్కువ మంది నోట వినిపిస్తోంది. టిడిపి అంతర్గత కమిటీల ఏర్పాటు విషయమై గత నెల 26న రాష్ట్ర కేంద్రం నుంచి త్రిసభ్య కమిటీ జిల్లాకు వచ్చిన సంగతి విదితమే. ఇందులో శాసనమండలి మాజీ చైర్మన్ ఎమ్‌డి ఫరూక్, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు ఉన్నారు. వీరంతా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వివిధ కమిటీల చైర్మన్లు, ఇతర ముఖ్య నాయకులతో చర్చించి, అధ్యక్ష పదవిపై అభిప్రాయాలు సేకరించారు. మొత్తంగా ఏడుగురి అభ్యర్థిత్వంపై నాయకుల అభిప్రాయాలు తీసుకున్నట్టుగా సమాచారం. వీరిలో నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి సువ్వాడ రవిశేఖర్, కంది చంద్రశేఖర్, గజపతినగరం నియోజకవర్గానికి చెందిన కరణం శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు పేర్లు మాత్రమే ఎక్కువ మంది ప్రస్తావించారు. వీరిలోనూ సువ్వాడకు హెచ్చుమంది అవకాశం ఇస్తే బాగుంటుందని చెప్పారట. ఆ తరువాత స్థానంలో శివరామకృష్ణ, కె.ఎ.నాయుడు, కంది చంద్రశేఖర్ పేర్లు ప్రస్తావించినట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తొలి నుంచీ పార్టీని అంటిపెట్టుకోవడంతో పాటు పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్న సువ్వాడకు మార్గం సుగమం అవుతుందనే చర్చ నడుస్తోంది. జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు త్రిమెన్ కమిటీ నివేదిక పంపి సుమారు 20రోజులు దాటింది. మన జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దావోస్ పర్యటనలో ఉండడం వల్ల చాలా రోజులు అందుబాటులో లేరు. మరోవైపు మంత్రివర్గ సమావేశాలు, శాసనసభ సన్నద్ధత వంటి కార్యకలాపాల్లో చంద్రబాబు, లోకేష్ పూర్తిగా నిమగ్నమై పనిచేశారు. ఈ నేపథ్యంలో అధ్యక్ష పదవి ఖరారు విషయంలో జాప్యం జరిగిందని, ప్రస్తుతం ఆయా కార్యకలాపాలన్నీ కొలిక్కి వస్తున్న నేపథ్యంలో ఈ నెలాఖరులోగా పదవి ఖరారు చేయవచ్చనే విశ్లేషణలు పార్టీ నాయకుల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో సువ్వాడ రవిశేఖర్‌కు లైన్ క్లియర్ అయ్యే ఛాన్సులు ఎక్కువగా కనిపిస్తుండటంతో ఆయన గ్రూపునకు చెందిన వారంతా ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది.

సువ్వాడ రవిశేఖర్

కరణం శివరామకృష్ణ

కెఎ నాయుడు

కంది చంద్రశేఖర్

24న చలో విశాఖ డెయిరీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

పాలరైతుల సమస్యలపై ఈ నెల 24న చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎపి పాలరైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.రాంబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఎన్‌పిఆర్ భవన్ వద్ద చలో విశాఖ డెయిరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెయిరీ అవినీతిపై హౌస్ కమిటీ విచారణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. లీటరు పాలకు రూ.10 చొప్పున సేకరణ ధర పెంచాలన్నారు. పశువులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. మందులు, దాణా 75 శాతం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై చేపట్టే ఆందోళనను విజయవంతం చేయాలని పాల రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో పాల రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు లోకవరపు ఆదినారాయణ మూర్తి, సంఘం నాయకులు సునీల్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాలరైతుల సంఘం నాయకులు

వైసిపిది అనవసర రాద్ధాంతం

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంపై మూడు రోజులుగా వైసిపి నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం అశోక్ బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో టిడిడి చైర్మన్‌గా ఉన్న కరుణాకర్ రెడ్డి టిటిడిలో వ్యాపారం చేశారన్నారు. అన్న ప్రసాదాన్ని, లడ్డు నాణ్యత విషయంలో కల్తీ చేశారని ఆరోపించారు. సంప్రదాయాలకు భంగం కలిగిస్తూ వచ్చారన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను జగనే కట్టించినట్లు చెప్పుకుంటున్న వైసిపి నాయకులు ఎంతవరకు వాస్తవాలు ఉన్నాయో తెలుసుకోవాలని హితవుపలికారు. ప్రయివేట్ పరం చేస్తున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అసెంబ్లీకి వెళ్లకుండా జగన్.. ప్రజల సమస్యలను ఏం పరిష్కరించగలరని ప్రశ్నించారు. ఎంత కాదనుకున్నా మాజీ ముఖ్యమంత్రి తన అనుభవాన్ని చట్టసభల్లో మాట్లాడితేనే ప్రజలకు మేలు చేయగలరని అభిప్రాయ పడ్డారు. పైడితల్లమ్మ జాతరలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ఎమ్‌పి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్‌పి కలిశెట్టి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

సిఐటియు ఆధ్వర్యాన సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సురేష్, టివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నగరంలో కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్ల కూడలి వరకు సిఐటియు ఆధ్వర్యాన పాలస్తీనా సంఘీభావ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా సహకారంతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం చేస్తూ పాలస్తీనా సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తోందన్నారు. యుద్ధం వల్ల 67 వేల మంది పాలస్తీనా ప్రజలు, కవులు, మేధావులు, చంటి పిల్లలు, మహిళలు చనిపోయారన్నారు. యుద్ధాన్ని ఆపి ప్రజల ప్రాణాలు కాపాడాలని అనేక దేశాలు కోరుతున్నా పట్టించుకోకుండా యుద్ధాన్ని కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని మోడీ ఇజ్రాయిల్‌కు పరోక్షంగా సహకరిస్తున్నారని తెలిపారు. మోడీ కలుగజేసుకుని అమెరికా జోక్యంతో యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు పాలస్తీనాకు అండగా ఉండాలని కోరారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని ప్రపంచ దేశాలు, ప్రజలు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, బి.సుధారాణి, వి.రాములు, వెంకటేష్, రాము పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీ చేపడుతున్న సిఐటియు నాయకులు

ప్రశ్నించడంతోనే ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోగలం

ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వెన్షన్‌లో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రశ్నించడం ద్వారానే ఆడపిల్లల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోగలమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి స్పష్టంచేశారు. ఆదివారం స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో గర్ల్స్ కన్వీనింగ్ కమిటి కో-కన్వీనర్ శిరీషా అధ్యక్షతన జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వెన్షన్‌లో ఆమె మాట్లాడారు. చదువుకునే వారికి ఉపాధి అవసరమని, ఉపాధి కావాలంటే అనేక సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించాలని చెప్పారు. ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. వాటిని సాధించుకోవడం కోసం మనం ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేడు సమాజంలో జరుగుతున్న పరిణామాలపైనా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆడపిల్లలు చాలా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. లింగ వివక్ష, లైంగిక వేధింపులు నేటికీ కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో బాలికలకు నాప్‌కిన్స్ ఇవ్వడం లేదన్నారు. నాప్‌కిన్స్‌పై పన్నులు వేయడం దుర్మార్గమన్నారు. వీటిపై జిఎస్‌టి రద్దు చేయాలని పోరాటం చేయడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. వరకట్న వేధింపులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ దృక్పథం కోసం, అందరితోపాటు సమానత్వం కోసం మనం పోరాటం చేయాల్సి ఉందన్నారు. ప్రధానంగా ఆడపిల్లలు ప్రశ్నించడం ద్వారానే మనుగడ ఉంటుందన్నారు. 12 రకాల హక్కులు ఆడపిల్లలకు రాజ్యాంగం కల్పించినట్లు తెలిపారు. గురజాడ అప్పారావు రచించిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ కథ మనకు కళ్లు తెరిపిస్తుందన్నారు. గురజాడ అప్పారావు స్ఫూర్తితో ఆడపిల్లలు సమస్యల పరిష్కారం కోసం, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని పోరాడాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా మాట్లాడుతూ నేడు విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు రూపకల్పన చేస్తామన్నారు. ముందుగా గురజాడ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి

సమిష్టిగా జిల్లాను అగ్రస్థానంలో నిలిపాం

'ఆత్మీయ వీడ్కోలు' కార్యక్రమంలో ఎస్‌పి వకుల్ జిందల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సమిష్టి సహకారంతోనే రాష్ట్రంలో విజయనగరం జిల్లాను అగ్రస్థానంలో నిలిపామని ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. ఎస్‌పిగా 14 నెలలు పని చేసి గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లిన వకుల్ జిందల్, కమాండెంట్ మల్లికా గార్గ్ దంపతులకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నగరంలోని మెట్రో ఫంక్షన్ హాలులో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి వకుల్ మాట్లాడుతూ తన సర్వీసులో జిల్లాలో పని చేయడం ఒక మధుర స్మృతిగా నిలుస్తుందన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు చేపట్టిన చర్యలు ఫలితంగా గంజాయి వ్యాపారులను కట్టడి చేశామన్నారు. కార్యదీక్ష కలిగిన పోలీసు అధికారులు జిల్లాలో పని చేస్తున్నారని, ఇటువంటి అధికారులు, సిబ్బంది ఇతర జిల్లాలో లభించడం కష్టమని అభిప్రాయ పడ్డారు. తాను జిల్లాలో మరో సంవత్సరం పని చేస్తానని భావించానని, ఆకస్మిక బదిలీ జరిగిందని చెప్పారు. కమాండెంట్ మల్లికా గార్గ్ మాట్లాడుతూ మీ మాటలు, చేతలు ద్వారా తమ పట్ల చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ ఎఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌పి వకుల్, కమాండెంట్ మల్లికా దంపతులను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

శశిభూషణరావుకు అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం

సత్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావుకు త్రేతాయుగ్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకమైన డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్ విజనరీ మెంటర్ అవార్డు - 2025 తో సత్కరించింది. విద్యా నైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో, నాయకత్వం, నిబద్ధత ద్వారా విద్యా విలువలను బలోపేతం చేయడంలో శశిభూషణరావు చేసిన నిరంతర ప్రయత్నాలకు గాను ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శశిభూషణరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్య, విలువ ఆధారిత అభ్యాసం ద్వారా విద్యార్థులను శక్తివంతం చేయడంలో తన నిబద్ధతను పునరుద్ఘాటించారు.

1న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్వచ్ఛంద రక్తదాన మాసోత్సవం, గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ ఒకటో తేదిన నగరంలోని ఎస్‌విఎన్ లేక్ ప్యాలెస్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ తెలిపారు. సామాజిక, ఆధ్యాత్మిక సేవావేత్తలు గుడిస వెంకటేశ్వరరావు, కస్తూరి భాయి దంపతుల జ్ఞాపకార్థం గాంధీ బ్లడ్ డోనార్స్ క్లబ్, ఎస్‌విఎన్ శివ జ్యోతి గ్రూప్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం పోస్టర్‌ను గ్రూప్ సభ్యులు జి.జ్యోతి, అబ్దుల్ రవూఫ్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ చంద్ర శేఖర్, గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం కళాశాలల కమిటీ కన్వీనర్ బి.రామ భద్ర రాజు, భగత్ సింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు రవి కుమార్, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ముదిదాన రాము ఆవిష్కరించారు.

జూనియర్ అథ్లెటిక్స్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి విజయనగరం జిల్లా నలుమూలల నుంచి సుమారు 500 మంది అథ్లెట్లు హాజరయ్యారు. ఈ పోటీలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 27,28,29 తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లీలాకృష్ణ, శ్రీకాంత్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సీతారామరాజు, కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు వర్మ రాజు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ కె.వి.ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

5న మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మహాసభ

విజయనగరం టౌన్ : అక్టోబర్ ఐదో తేదిన మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.మురళీధర రావు తెలిపారు. ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రంగరాజు, బుగత అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పించాలి

విజయనగరం టౌన్ : చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.కామేష్, ఎస్.రంగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగరపాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేసిన 15 మంది ఉద్యోగ విరమణ పొందారని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, తుపాకుల శ్రీను పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుతో సేవలు వేగవంతం

- 4,35,557 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ
- జిల్లాలో 7,04273 గ్యాస్ కనెక్షన్లు
- 1249 రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు
- 'ప్రజాశక్తి' జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మురళీనాథ్ ముఖాముఖి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

'జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నాం. జిల్లాకు 5,68,287 స్మార్ట్ కార్డులను మంజూరు చేసింది. ఇంతవరకు 4,35,557 కార్డులను పంపిణీ చేశాం. 1,32,154 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కార్డులతో రేషన్ డిపోల్లో సేవలు వేగవంతం అవుతాయ'ని జిల్లా పౌర సరఫరాల అధికారి జి.మురళినాథ్ వివరించారు. జిల్లాలో 1249 రేషన్ డిపోల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 7,04,273 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, వీటి ద్వారా ప్రజలకు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



జిల్లాలో ఎన్ని స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.?

విజయనగరం జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం 5,68,287 స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 4, 35,557 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశాం. ఇంకా 1,32,154 స్మార్ట్ కార్డులు పంపిణీ చేయడానికి ఏర్పాటు చేస్తాం. ఇది నిరంతర ప్రక్రియగానే కొనసాగుతుంది. ఈ స్మార్ట్ రేషన్ కార్డులో క్యూఆర్ కోడ్ ఉంటుంది. లబ్ధిదారులకు సంబంధించిన అన్ని వివరాలు ఈ స్మార్ట్ రేషన్ కార్డులో ఉంటాయి.. క్యూఆర్ కోడ్ ఓపెన్ చేయగానే పూర్తి డేటా వస్తుంది. లబ్ధిదారులకు ఏయే నిత్యావసర సరుకులు అందిస్తామో వివరాలు తెలుస్తాయి.

జిల్లాలో ఎన్ని రేషన్ డిపోలు ఉన్నాయి.?

జిల్లాలో 1249 రేషన్ డిపోలు ఉన్నాయి. వాటి ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్నాం. విజయనగరం డివిజన్లో 456, బొబ్బిలి డివిజన్లో 329, చీపురుపల్లి డివిజన్లో 454 రేషన్ షాపులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతానికి బియ్యం, పంచదార, కందిపప్పు అందిస్తోంది.

జిల్లాలో ఎన్ని గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.?

జిల్లాలో 7,04,273 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో దీపం కనెక్షన్లు 5,02,634 ఉన్నాయి. మిగతావి వివిధ రకాల గ్యాస్ కనెక్షన్లు. సూపర్ సిక్స్‌లో భాగంగా సంవత్సరానికి మూడు గ్యాస్ కనెక్షన్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది

ఎన్ని వాహనాల ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేస్తున్నారు.?

జిల్లాలో 11 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. వాటి నుంచి వివిధ గ్రామాల్లో ఉన్న రేషన్ షాపులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నాం. విజయనగరం డివిజన్లో 155 వాహనాలు, బొబ్బిలి డివిజన్లో 94, చీపురుపల్లి డివిజన్లో 121 వాహనాలు ద్వారా నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నాం.

చలో విశాఖ డెయిరీ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పాడిరైతుల డిమాండ్ల సాధనకు ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ పాలరైతుల సంఘం (ఎపిఆర్‌ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని పాడిరైతులు విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యుడు చెలికాని ముత్యాలు కోరారు. ఈ సందర్భంగా పాడిరైతులతో కలిసి ఆదివారం పోస్టర్లు విడుదల చేశారు. డెయిరీ అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి, దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని, పాల సేకరణ ధర లీటరుకు పది రూపాయలు పెంచాలని, ప్రతి మూడు నెలలకు బోనస్, మరణించిన పాడి రైతు కుటుంబానికి పరిహారం చెల్లింపు, పశువులకు ఉచిత బీమా, మందులు, 75శాతం రాయితీతో పశుదాణా పంపిణీ చేయాలనే డిమాండ్ల సాధనకు తరలిరావాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని రేగిబిల్లి గ్రామంలో నాలుగు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు ఆదివారం మదర్ తెరిసా సేవా సంఘం బ్లడ్ డోనర్స్ క్లబ్ సంస్థ ఆర్థిక సహాయాన్ని అందించింది. బీసీ కాలనీకి సంబంధించిన ఇనుముల రాములమ్మ, దండమ్మ పూరి గుడిసెలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయన్న విషయాన్ని ప్రసాద్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎర్రపు ప్రసాద్ అయ్యన్నపేట జంక్షన్‌లో ఉన్న మదర్ తెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ సంస్థ అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్‌కి తెలియజేయడంతో నెల్లిమర్ల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన వర్రీ జగన్నాథరావు సహకారంతో చీరలు, దుప్పట్లు, తువాళ్ళు, మదర్ తెరిసా సేవా సంఘం సంస్థ తరపు నుంచి 15 రకాల నిత్యవసర వస్తువులను సంగం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ యువత శ్రీను, మణికంఠ, భానుప్రసాద్, ఎర్నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఏమైనా సాధించొచ్చు

మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి - చీపురుపల్లి

సాధించాలనే పట్టుదల ఉంటే దేన్నైనా సాధించ వచ్చని మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలో ఒప్పంద పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తున్న మంగమ్మ కుమారుడు పెద్దింటి ధనుంజయ ఇటీవల విడుదలైన డిఎస్‌సిలో పిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ)లో జిల్లాలో 58వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బెల్లాన చంద్రశేఖర్ ధనుంజయ్‌ని అభినందిచి ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా బెల్లాన మాట్లాడుతూ రిక్షా కార్మికుడు కొడుకు రిక్షా కార్మికుడిగానో, పారిశుధ్య కార్మికుడు కొడుకు పారిశుధ్య కార్మికుడిగానో కాకుండా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన నాడే ఆ కుటుంబానికి గౌరవంతో పాటు సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ క్రమంలోనే ధనుంజయ్ పట్టుదలతో చదివి పీడీగా ఉద్యోగాన్ని సంపాదించడం చాలా మంచి పరిణామమని ఆయన మరింత మందికి ఆదర్శమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీ తదితరులు పాల్గొన్నారు.

పెదమేడపల్లిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి సచివాలయం వద్ద ఆదివారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ అరుణ 47 మంది కంటి రోగులకు పరీక్షలు జరిపి, 21 మందిని కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో పారదర్శకత

ప్రజాశక్తి - రామభద్రపురం

యూరియా పంపిణీలో పారదర్శకత పాటించి పంట వేసిన ప్రతీ రైతుకు అందించే ఏర్పాటు చేయాలని తహశీల్దార్ అజురఫీజాన్ ఆదేశించారు. ఆదివారం రొంపల్లి రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ కార్యక్రమంలో ఎఒ శివతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా ఎరువులు వాడకుండా నానో యూరియా వాడకంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎఒ శివ మాట్లాడుతూ ఎకరా పొలానికి కేవలం 500 ఎంఎల్ నానో యూరియా సరిపోతుందని, 2వ దఫా యూరియాకి బదులుగా నానో యూరియా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకరావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది గణపతి, రాము, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన సత్కారం

ప్రజాశక్తి - గరివిడి

సత్కారం పొందిన విద్యార్థినులు

కోడూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు గేదెల దేదీప్యా, చరిష్మా సాహసంతో వృద్ధుడిని కాపాడిన సందర్భంగా స్థానిక బ్రాహ్మ కుమారీస్ సెంటర్ ఇంచార్జి బికె హేమలత ఆదివారం వారిద్దరినీ ఘనంగా సత్కరించి అభినందించారు. కొద్ది రోజులు క్రితం వీరిద్దరూ పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా కంటిచూపు లేని ఎ.ఆదినారాయణ (60) అటుగా వెళ్తున్నారు. అతని ముందు విష సర్పం ఉండడం చూసి ఆ చిన్నారులు పక్కకు లాగి పాము కాటు నుంచి కాపాడారు. కళ్ళ లేని తాత ముందు పాము రూపంలో ప్రమాదం పొంచి ఉందని చూసి సమయస్ఫూర్తిగా వ్యవహరించిన బాలికల సాహసం ప్రశంసనీయం. సాహసంతో వృద్ధుడిని కాపాడిన సందర్భంగా వారిద్దరినీ సత్కరించారు. రాష్ట్ర మానవ హక్కుల మహిళా ఉపాధ్యక్షులు భోగాపురపు శ్రీదేవి విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపి దీవెనలు అందించారు.

టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌లో తృతీయ స్థానం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని భవాని నగర్ వద్ద గల వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఈ నెల 12వ తేదీన విశాఖపట్నంలో జరిగిన టార్గెట్ బాల్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం తరపున సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఎం.షారోన్ షైనీ, బి.అనురాధ ఆడి తృతీయ స్థానాన్ని, సబ్ జూనియర్ బాలుర విభాగంలో డి.హర్షవర్ధన్, కె.దేవీ ప్రసాద్ ఆడి ద్వితీయ స్థానాన్ని సంపాదించారు. విద్యార్థులు ఎంపికయ్యే విధంగా తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.రాముని, విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ వై.జానకీదేవి, పాఠశాల యాజమాన్యం డాక్టర్ వరలక్ష్మి, రాజేంద్రప్రసాద్ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోని రాణించడం సంతోషదాయకమని డాక్టర్ వరలక్ష్మి, స్కూల్ వ్యవస్థాపకులు రాజేంద్రప్రసాద్ అభినందించారు.

తమటాడలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని ముద్దూరు పంచాయతీ తమటాడ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో కోండ్రు రమణమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. కాగా ఆ సమయంలో గ్యాస్ సిలెండర్ పేలిన సంఘటన చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షలు ఆస్థి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో రమణమ్మతో పాటు భర్త అచ్చెన్న, ఇద్దరు పిల్లలు ఇంట్లో ఉండటంతో బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ అగ్ని ప్రమాదంలో ఇంటిలో దాచుకున్న నగదు, దుస్తులు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో బాధితులు నిరాశ్రయులయ్యారు.

మంత్రి కొండపల్లి భరోసా: అగ్ని ప్రమాద వార్త తెలుసుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి రావాల్సిన ఆర్థిక సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. టిడిపి నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. మండల టిడిపి అధ్యక్షులు రాపాక అచ్చుం నాయుడు, బొండపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు, సర్పంచ్‌లు నడుపూరి భాస్కర నాయుడు, మీసాల జానకిరావు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పవన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీఆదిత్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి పవన్ సాయి రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ -14 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన పవన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శ్రీఆదిత్య పాఠశాలలో సిహెచ్ పవన్ సాయి 9వ తరగతి చదువుతున్నాడు. పవన్‌ను ప్రిన్సిపల్ బి.కళ్యాణి, కరస్పాండెంట్ ఉమా నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

గురజాడ దేశభక్తి గేయాన్ని పాఠశాలల్లో ఆలపించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గురజాడ రచించిన దేశభక్తి గేయాన్ని పాఠశాలల్లో ఆలపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు కోరారు. గురజాడ జయంతి ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ఎల్‌బిజి నగర్‌లో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ ఇంటిని సాంస్కృతిక మ్యూజియంగా తీర్చిదిద్దాలన్నారు. గురజాడ ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఆధునిక మహిళ చరిత్ర తిరిగి రాస్తుందని గురజాడ చెప్పిన చారిత్రక వాస్తవం అందరూ గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర కమిటీ సభ్యులు బి.రమణ, ఆర్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు స్వగృహంలో మహాకవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త జిఎస్ చలం మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా అభ్యుదయ భావాలను సమాజానికి చాటిచెప్పారని కొనియాడారు. కార్యక్రమంలో సంస్కృత కళాశాల అధ్యాపకులు యామిని, కన్వీనర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, కెఎవిఎస్ సుబ్రహ్మణ్యం, ఎం.రామారావు, పాల్గొన్నారు. కామాక్షినగర్‌లో సాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన గురజాడ అప్పారావు చిత్రపటానికి ఎస్‌టి కమిషన్ మాజీ చైర్మన్ డివిజి శంకరరావు నివాళులర్పించారు.

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి, ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు ఆధ్వర్యంలో పాఠకులు, గ్రంథాలయాధికారి దామోదర్ శ్రీధర్ నివాళులర్పించారు.

తెర్లాం: స్థానిక మండల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

బొబ్బిలి: గురజాడ తెలుగు భాషకు వెలుగు జాడ అని విద్యల నగరానికి విజ్ఞుడని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. ఆదివారం కారుణ్య కార్యాలయంలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతిని కారుణ్య సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య రోటరీ సభ్యులు ఆర్ఎస్ రాజు, చిన్నారావు, రామకృష్ణ, రాంబాబు, చందు, కృష్ణ మోహన, శివకాంత్, జయ ప్రకాష్, చంద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.**యుటిఎఫ్ ఆధ్వర్యంలో:** గురజాడ జయంతిని పురస్కరించుకుని మండల విద్యా వనరుల కేంద్రం వద్ద యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయులు సంఘం అధ్యక్షులు వేణుగోపాల్, యుటిఎఫ్ నాయకులు విజయగౌరి, ప్రసన్న కుమార్, మహేష్, కృష్ణదాసు, రామకృష్ణ, స్వామినాయుడు, చక్రధర్‌లు పాల్గొన్నారు.

13 గంటల పని దినాన్ని వ్యతిరేకించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

139 సంవత్సరాల పోరాట స్ఫూర్తికి కార్మిక హక్కులకు నేడు కేంద్రంలో, రాష్ట్రంలో దుర్మార్గంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం తెచ్చిందని రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం 13 గంటల పని విధానం అమలకు బిల్లు ఆమోదించిందని దీన్ని వ్యతిరేకించాలని సిఐటియు నాయకులు పి. శంకరరావు కోరారు. 13 గంటల పని దినాలకు వ్యతిరేకంగా కార్మికులతో కలిసి ఆదివారం ఎం.బూర్జవలసలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పి.శంకర్రావు, ఎస్. గోపాలు మాట్లాడుతూ ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పనిగంటల పెంపును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిడిపి, జనసేన బిజెపి సభ్యులందరూ ఈ నెల 19న అసెంబ్లీలో ఫ్యాక్టరీలో షాపులు సంస్థలలో పనిచేసే కార్మికుల పనిగంటల పెంపును ఆమోదించారని అన్నారు. వైసిపి అసెంబ్లీకి వెళ్లకుండా బాధ్యతారాహితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ బిల్లును ఈనెల 22న శాసనమండలిలో ఆమోదానికి పెట్టే అవకాశం ఉందని తెలిపారు. మండలిలో ఉన్న వైసిపి సభ్యులు ఈ పెంపును వ్యతిరేకించాలని బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు ఫ్యాక్టరీల యాజమాన్యాలకు కార్మికుల శ్రమను దోచిపెట్టే చంద్రబాబునాయుడు దుర్మార్గమైన పనిగంటల పెంపు విధానాన్ని టిడిపి ఎమ్మెల్యేలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. కార్మికులు కష్టజీవులు ఓట్లు వేయించుకొని యాజమాన్యాలకి కార్పొరేట్లకి సేవ చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కె. శంకర్రావు, జి.అప్పలనాయుడు, గ్రోత్ సెంటర్ కార్మికులు పాల్గొన్నారు.

మిమ్స్ ఎదురుగా ఫ్లెక్సీలతో ఇబ్బందులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

బస్సు షెల్టర్, ఆర్‌ఒ ప్లాంట్‌కు ముందు అడ్డుగా ఉన్న ఫ్లెక్సీలు

మిమ్స్ జనరల్ ఆసుపత్రి ఎదురుగా ఫ్లెక్సీలతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మిమ్స్ ఎదురుగా ఉన్న స్థలంలో ప్రయాణికులకు బస్ సెల్టర్, తాగు నీరందించే ఆర్‌ఒ ప్లాంట్‌ను దాతలు ఏర్పాటు చేశారు. అక్కడే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో బస్ సెల్టర్, తాగు నీరు ప్లాంట్ కనబడకపోవడంతో లోపలికి వెళ్ళి నిలబడి నీరు తాగే పరిస్థితి లేదని విద్యార్థులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి మిమ్స్ ఆసుపత్రికి వచ్చేవారు, విద్యార్థులు బయట నిలబడకుండా బస్ సెల్టర్, ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికీ ఫ్లెక్సీల కారణంగా ఎవరికీ వినియోగంలో లేకుండా పోయిందని చెబుతున్నారు. కాగా ఫ్లెక్సీల ఏర్పాటుపై ఇస్కాన్ సంస్థ కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికార్లు స్పందించి ఫ్లెక్సీలు తొలగించి బస్ సెల్టర్, ఆర్‌ఒ ప్లాంట్ వినియోగంలోకి తీసుకు రావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డ్రెయినేజీ సమస్యపై వాగ్వివాదం

ప్రజాశక్తి - భోగాపురం

ఎమ్మెల్యేను నిలదీస్తున్న సర్పంచ్ నూకరాజు

ముంజేరులోని డ్రెయినేజీ సమస్యపై పెద్ద ఎత్తున వాగ్వివాదం చోటు చేసుకుంది. ఆ గ్రామ సర్పంచ్, ఎమ్మెల్యే మధ్య కాసేపే వాదోప వాదలు జరిగాయి. దీనంతటికి స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వేదికైంది. ఎంపిడిఒ కె. గాయత్రి ఆధ్వర్యంలో ఎంపిపి ఉప్పాడ అనూషా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పాల్గొని సమీక్షించారు. ప్రధానంగా యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు, విద్యుత్ సమస్యలు, ఎయిర్‌పోర్టు వరద నీరు కారణంగా ఇబ్బందులు పడుతున్న గ్రామాల ప్రజల సమస్యలపై చర్చించారు. సాధారణ సమస్యలపై చర్చ జరుగుతున్న సమయంలో ముంజేరు గ్రామ డ్రైనేజ్ నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న సమస్య మరోసారి చర్చకు వచ్చింది. ఈ సమస్యపై గతంలోనూ తీవ్ర చర్చలు జరిగినప్పటికీ పరిష్కారం లభించలేదని ఆ గ్రామ సర్పంచ్ పూడి నూకరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం మాధవి, ముంజేరు సర్పంచ్ పూడి నూకరాజును ఉద్దేశించి మీరు పంచాయతీ తీర్మానం చేస్తేనే నేను నిధులు తెప్పిస్తాను అని సూచించారు. ప్రతి స్పందించిన సర్పంచ్ నూకరాజు, మీరు ముంజేరు పంచాయతీకి రూ.24 లక్షల పన్ను కట్టాల్సి ఉందని, ఆ బకాయి చెల్లిస్తేనే తాను తీర్మానం చేయిస్తాను అని స్పష్టం చేశారు. దీనిపై ఎమ్మెల్యే ముందు తీర్మానం చేయండి, తర్వాత తాను పన్ను చెల్లిస్తాను అంటూ మధ్యలోనే ఆమె సమావేశం నుండి వెళ్లిపోయారు. ఈ ఘటన మినహాయిస్తే సమావేశం సజావుగానే కొనసాగింది. వివిధ అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎం.రవణమ్మతో పాటు పలువురు అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2వేల కోట్లతో జలాశయాల పనులు

ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- రేగిడి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

జలాశయాల ద్వారా ఏడాదికి మూడు పంటలు పండించేందుకు తోటపల్లి, మడ్డువలస జలాశయాలకు రెండువేల కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ వెల్లడించారు. ఉంగరాడ మెట్ట వద్ద 11 మందికి రూ.6.33లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. తోటపల్లి, మడ్డవలస రిజర్వాయర్ నుంచి శివారు గ్రామాల వరకు సాగునీరు అందించేందుకు సిఎం చంద్రబాబు అసెంబ్లీలో నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి దిగువ భాగాలకు ఆధునీకరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్‌సి మిట్టల్ అనకాపల్లి ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడం ద్వారా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఖరీఫ్ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు సకాలంలో పంపించిందన్నారు. తెల్ల రేషన్ కార్డులు ఉండి అనారోగ్యంతో బాధపడిన కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్, పాలూరి రామినాయుడు, పాలవలస రామచంద్రి నాయుడు, నారు జనార్ధన రావు, మంతిన ఉష, కడగల నాగరాజు, గంగ కృష్ణారావు, కర్రి రమణ, కర్నేన గౌరునాయుడు, సూరపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ 19 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో రెండు కోట్ల వరకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గురవాణ నారాయణ రావు, వంగా వెంకటరావు, మరిపి జగన్, బోనేలా నారాయణ రావు, ఆగురు అప్పలనాయుడు, బవిరి శ్రీనుబాబు, బిజెపి నాయకులు కోటగిరి నారాయణరావు, జనసేన నాయకులు యూపీ రాజు, రమేష్, గెడ్డపు నీలకంఠం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను చెట్టును దర్శించుకున్న మంత్రి

ప్రజాశక్తి- గంట్యాడ

సిరిమాను చెట్టు వద్ద పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్

ఉత్తరాంధ్ర ఇలవేల్పు విజయనగరం పైడితల్లమ్మ సిరిమాను చెట్టు కొండ తామరపల్లి గ్రామంలో వెలసిన విషయం తెలిసిందే. ఈ చెట్టును ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొండతామరపల్లి గ్రామంలో సిరిమాను చెట్టును కోరడం మండలానికి ఎంతో అదృష్టంగా భావించాలన్నారు. దర్శనానికి వచ్చిన భక్తులందరినీ గ్రామస్తులు ఆదరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 24వ తేదీన సిరిమాను విజయనగరం తరలించడానికి స్థానిక నాయకులతో చర్చించారు. సిరిమాను తరలించిన రోజున అన్న సంతర్పణ కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని వచ్చిన భక్తులందరికీ స్థానిక భక్తులు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, అల్లు విజయ్ కుమార్, కొండతామరపల్లి టిడిపి నాయకులు మాసారుపు ఎరుకునాయుడు, గంట్యాడ పిఎసిఎస్ అధ్యక్షులు బూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలంటే లెక్క లేదా: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - భోగాపురం

ప్రజల ఆరోగ్యాన్ని లెక్కచేయని ప్రైవేటీకరణపై ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం భోగాపురం ఎంపిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో నడపాలని తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ఇది చాలా పెద్ద ముప్పు అవుతుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం జీతాలు చెల్లిస్తున్న మెడికల్ కాలేజీలను ప్రైవేటు పార్టనర్‌షిప్ పేరుతో అప్పగించడం తప్పుడు నిర్ణయమని ప్రైవేట్ యాజమాన్యాలు వస్తే వైద్యానికి ఈ ఖర్చులు అమాంతం పెరిగిపోతాయని ఇది పేదవాడికి మోయలేని భారంగా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులే ప్రజలకు ఆపన్నహస్తం అయ్యాయని, భవిష్యత్తులో ఏదైనా కొత్త వైరస్ వస్తే పిపిపి పద్ధతి వల్ల ప్రజలు ఆరోగ్యపరంగా చాలా నష్టపోవలసి ఉంటుందని ప్రజల ప్రాణాలను కాపాడే ప్రభుత్వ వైద్యంగాన్ని ప్రైవేటీకరించకుండా వెంటనే ఆ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక కేంద్రం నుండి వస్తున్న యూరియా బస్తాలను మనీ రూపంలో చంద్రబాబు కన్వెర్ట్ చేసుకొని లేనిపోని అపోహలను ప్రజలకు చూపిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎంపిపి అనూష రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ సృష్టికి మూల కారణ కర్త విశ్వకర్మ

ప్రజాశక్తి-చీపురుపల్లి

విశ్వకర్మ సృష్టికే మూలమని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లంపల్లి ఆచారి అన్నారు. పట్టణంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో ఆయన ఆదివారం పాల్గొని విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుగ్వేదం, యజుర్వేదాలలో విశ్వకర్మ సృష్టికర్తగా, అధర్వణ వేదంలో ఆహార ప్రధాతగా విశ్వకర్మ అభిర్ణించబడ్డారని ఆచారి తెలిపారు. విశ్వానికి దైవిక వాస్తు శిల్పిగా, కళాత్మకత, నైపుణ్యం, సృజనాత్మకతకు ప్రతిరూపంగా విశ్వకర్మను భావిస్తారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విశ్వకర్మ జయంతిని అత్యంత వైభవంగా జరుపుకోవడం చాలా మంచి పరిణామమని ఆయన అన్నారు. అంతకు ముందు ఆయనను స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపల్లి అప్పారావు, విజయనగరం పట్టణ నాయకులు ఏడాకుల గోవిందరావు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్కోజు సత్యన్నారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోచర్ల రామకృష్ణతో పాటు స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పట్నాన ఈశ్వరరావు, సర్వశిద్ధి భాస్కరరావు, లెంకలపల్లి కనకరాజు పాల్గొన్నారు.

సిరిపురం విద్యార్థుల ఫీల్డ్ విజిట్

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యలో క్షేత్ర పర్యటన చేశారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట విహార కేంద్రానికి విద్యార్థులు వెళ్లి కన్నిధర కొండ, వాటర్ ఫాల్స్, ఎన్‌టిఆర్ పార్క్, గిరిజన తండా సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులు బురాడ శ్రీనివాసం, రామమూర్తి విద్యార్థులకు గిరిజన సంస్కృతిని వివరించారు. తరగతి గది నాలుగు గోడలకు మించి వెళ్లేటప్పుడే అభ్యాసం మరింత ఉత్సాహంగా మారుతుందని తెలిపారు. హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్, జట్టు కృషి, ఆత్మవిశ్వాసం, కెరీర్ అవగాహన, శారీరిక శ్రమ విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.

జిందాల్ భూముల బదలాయింపు ఆపండి

శృంగవరపుకోట: కంపెనీ కడతామని తీసుకున్న భూమిని కంపెనీ కట్టకుండా ఇతరులకు బదలాయించే చర్యలను ఆపి, నిర్వాసితుల నుంచి తీసుకున్న భూమిని తిరిగే నిర్వాసితులకు ఇవ్వాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఆదివారం బొడ్డవరలో నిర్వాసితులతో ఆయన మాట్లాడుతూ 93 రోజులుగా తమ భూములను తమకు అప్పగించాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. భూమి తీసుకుని 18 ఏళ్లయినా కంపెనీ కట్టని జిందాల్‌పై ఎటువంటి చర్యా తీసుకోకపోగా, బతుకుతెరువులేని నిర్వాసితుకు 2013 చట్టం అమలు చేయడం లేదన్నారు. బొడ్డవర, తాటిపూడి రోడ్డును ఆనుకొని ఉన్న విలువైన భూములను జిందాల్ పరిశ్రమ పేరుతో దళిత, గిరిజనులను మాయ చేసి సేకరించి ఇప్పుడు ఆ భూములను ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ చేసుకునేందుకు జీవో 14 తెచ్చి, ప్లాట్లుగా చేసి అమ్ముకునేందుకు సిద్ధపడటం సిగ్గుచేటన్నారు. వెంటనే ఆ భూములను నిర్వాసితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

దళితులు ఏకం కావాలి

ప్రజాశక్తి- వేపాడ

రాజ్యాంగం హక్కుల కోసం దళితులంతా ఏకం కావాలని ఉద్యమ నేత ఆతవ ఉదయభాస్కర్ కోరారు. అంబేద్కర్ జ్ఞాన విజ్ఞాన బృందంతో ఆదివారం అరిగిపాలెం, ఎస్‌కోట సీతారాంపురం, రామస్వామిపేట గ్రామాలలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉపాధి, విజ్ఞానం అనే రంగాలలో ముందుకు సాగాలంటే పోరాటమే శరణ్యమని అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ రద్దు చేయాలని, సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని, ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డోల కేశవ, గుర్రపు శ్రీను, తెరపల్లి కోటరావు, బోనెల ఈశ్వరరావు, శివరామకృష్ణ, ఎస్.కృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళితులు

మహారాజశ్రీ రాజాం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
SOP 6/2025

పిటిషనరు : నలితం జయలక్ష్మీ
రెస్పాండెంటు : నిల్
To
విజయనగరం జిల్లా, రాజాం మండలం, రాజాం గ్రామం, తెలగావీధి కాపురస్తులకు
రాజాం గ్రామం, తెలగావీధి కా॥రాలు నలితం సరస్వతి చనిపోయినందున ఆమెకు వారసురాలుగా ఆమె బావగారి కోడలు వారసురాలుగా (పిటిషనరును) నిర్ణయిస్తూ, పిటిషనరు పేరున వారసత్వాపు సర్టిఫికేటు ఇప్పించ కోరుచూ పిటిషనరు పై నెంబరు పిటిషను దాఖలు చేసినందున ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల పై కోర్టువారి ఎదుట **తే 27-10-2025దీని ఉదయం 10-30 గం॥లకు** హాజరై మనవి చేసుకోవలెను. అటుల ఎవ్వరూ హాజరు కాని యెడల పిటిషనరుకు అవసరమగు ఆర్డర్లు జారీ చేయడమగునని యీ నోటీసు మూలంగా తెలియపర్చడమైనది.

శ్రీ S. పోలారావు
పిటిషనరు తరపు న్యాయవాది,
రాజాం - 532127,
విజయనగరం జిల్లా,
సెల్ : 9985913883
రాజాం
తే 21-9-2025 ది

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE CUM MACT AT VIZIANAGARAM.
M.V.O.P.No 443/2024.

Between:
1. Sri Pathivada Shankara Rao,
2. Smt Vempadapu Ramanamma,
3. Smt Durgasi Rajeswari,
4. Smt Chintapalli Appalaraju.
-----Petitioners.

And:
1. Sri Ranjit Kumar Ray,
2. Sri Amit Kumar Singh,
3. Bajaj Allianz General Insurance Co Ltd, Represented by its Divisional Manager, Visakhapatnam. (Police bearing No OG-24-2495-1803-00005039 valid from 19-09-2023 to 18-09-2024) -----Respondents.

To,
THE RESPONDENT NO 1 AND 2:-
1. **Sri Ranjit Kumar Ray,** S/o Keshwar Ray, Hindu, aged about 28 Years, Resident of Chakiya Village - Chakiya Mandir Panapur, Chakia Panapur,Saran, Br, Bihar – 841 410.
2. **Sri Amit Kumar Singh,** S/o Upendra Singh, Hindu, aged about 40 Years, Shibtala Binapani Club, Podrah Podar, Howrah, West Bengal - 711 109.

Please take notice that the above named Petitioners instituted the above matter against yourselves and others and the same stands posted on **29th day of September 2025 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court **at 10.30 A.M.,** failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA
BODDU KARTHIK
ADVOCATES,
VIZIANAGARAM, PHONE: 9492019394.